


## శ్రీ బసవేశ్వర

చీకటిపడింది. ఆనాడు పంచమి. ఇంకా చంద్రోదయము కాలేదు. అయితే చంద్రోదయానికి పూర్వము వచ్చే పిల్లవాయువులు అప్పుడే కొంచెముకొంచెముగా సాగినవి. సాయంత్రము కొట్టిన వడగాలికి ఎండిపోయిన ప్రాణము యిప్పుడు వీస్తూవున్న చల్లగాలికి చిగురుస్తున్నగి.

ఆ చీకట్లో రెండెద్దులబండి నిర్జీవంగా వస్తూవుంది. ఆబండికి కట్టిన రెండుయెద్దులూ చప్పున యెద్దులుగా కనుపించడములేదు. ఒకటి దున్నపోతేమోననిపిస్తున్నది. అయితే కొంచెము పరకాయించి చూస్తేమాత్రము రెండూయెద్దులుగానే తోస్తవి. బండి రోడ్డు దిగుతుందేమోననే భయము కూడా వేస్తూవున్నది. చంద్రోదయము అయి కాస్త వెలుతురువస్తే ఆ వెలుతురులో దారి అయినా తెలుస్తుందేమో.

పెళ్లియింటి యెదట ఆ బండి ఆగింది. శ్యామలా - నాగేశ్వరరావూ బండిదిగినారు. పెద్దల్లుడూ పెద్దకూతురూ యింటికి వచ్చినారనంగానే యింటిల్లిపాదీ యీగలు ముసిరినట్టు వారిచుట్టూ మూగినారు.

శ్యామల కాపరానికి వెళ్లిన కిందటి మూడుసంవత్సరాలలో యిదే మొదటిపర్యాయము పుట్టింటికిరావడము. అదివరకు ఒక్కపండగకయినా పర్వానికయినా నాగేశ్వరరావు పంపకపోతేనేమి - తాను రాకపోతేనేమి శ్యామల పుట్టింటికి రాలేదు.

నాగేశ్వరరావు బండివాడితో "తెల్లవారురఝాము రైలుకువస్తాను వుండు"మన్నాడు.

ఆ మాటకు ఎవరూ అవునని కానీ కాదని కానీ అనలేదు.

*　　　*　　　*

"మా నాన్నకు చాలాకోపము వచ్చింది...మీతో మాట్లాడనయినా లేదుసుమా! పోనీ లగ్నమువర్లకయినా వుండండి"

"ఏదో నీవు ఏడుస్తూ వుంటే నిన్ను ఎట్లాగయినా వదిలించుకొందామని వచ్చినాను. నాకిప్పుడు మీ చెల్లెలు పెండ్లిగోల పట్టింది?"

"అది కాదండి. నేను మిమ్మలను రమ్మని యెందుకు అంత పట్టుబట్టినానో తెలియలేదు కాబోలు. నేను మీ దగ్గరకు వచ్చిన తర్వాత ఒక్కనాడయినా మీరు నాతో ఖులాసాగా కాలం గడిపారూ... చెప్పండి."

"ఏదీ తీరితే కాదూ..."

"మీకు నామీద ప్రేమవుంటే కాదూ...మీకు ఆ దిక్కుమాలిన వంతెనల మీదా యినపముక్కల మీదా వున్న ప్రేమలో ఒకలక్షోవంతు అయినా నామీద వుంటే కాదూ... పెళ్లిలో నయినా హాయిగా యీ అయిదు రోజులూ మీతో ఖులాసాగా వుంటానేమో ననుకొన్నాను."

"పెళ్లిలో - యింత హడావిడిలో మనము యిద్దరమూ ఒకచోట ఖులాసాగా...ఎట్లా వీలు అవుతుందను కొన్నావు?"

"మీరుంటే మీకే తెలుస్తుంది"

"నేను వుండడానికి వీలులేదు."

"నన్ను వదిలిపెట్టి వెళ్తారా?"

"అందుకే నిన్ను తీసుకొని వచ్చాను."

"అట్లాఅయితే యిక నేను మీయింటికి రానేరాను"

"పోనీ మరీమంచిది."

"మీరు వెళ్లడానికి వీలులేదు."

"ఏం పట్టుకొని కట్టివేస్తావా?"

ఆమె నోటివెంట యింకా జవాబు రాలేదు. ముఖము ముడుచుకొని పోతున్నది. కండ్లలోనుంచి బొట బొట నీళ్లు కారుతున్నవి. అతనిచేయి పట్టుకోబోయింది. ఇంతలో సుబ్బారావు వచ్చాడు. వచ్చే రావడముతోటే "అన్నగారూ, మీరు వెళ్లడానికి వీలులేదు. మీరువచ్చిన బండి మా మామయ్య రాత్రే పంపించి వేశాడు. ఇక మీకు బండికట్టేవా డెవడూ యీవూళ్లో దొరకడు. ముహూర్తము వరకయినా వుండండి మరి" అన్నాడు.

"సుబ్బా నీకుచెపితే అర్థం అవుతుంది. వీళ్లంతా ఎంత చదువుకొన్నవాళ్లయినా పల్లెటూరి మేళం. రేపు మధ్యాహ్నము ఛీఫ్ యింజనీరు వస్తాడు. ఆ సమయానికి నేను వుండితీరాలి. పోకతప్పదోయ్"

"అట్లాకాదు. కావలెనంటే డాక్టరు సర్టిఫికేట్ అయినా పుచ్చుకొని రేపటివరకయినా శెలవు పెట్టండి రేపు రాత్రికి వెళ్దురుగాని"

"కాదోయ్, ఆ ఏటికి కట్టబోయే వంతెనెకంతా పరిశోధన (Invistigation) నేను చేశాను. ఈ సమయములో నేను లేకుండా వుండడానికి వీలులేదు."

"ఫరవాలేదు లెస్తూ"

"అట్లాకాదు. నేను రెండున్నర సంవత్సరాలనుంచీ అహోరాత్రిళ్లు నిద్రాహారాలు లేకుండా చేసినపని వచ్చే వాడికి అర్థమవుతుందో కాదో. అందుకోసం నేను స్వయంగావుండి వివరించి చెప్పవలెను."

"సరే. మరి బండీ యెక్కడా దొరకదే."

"బండి దొరకకపోతే నడిచివెళ్తాను. వెన్నెలకూడాను. ఇంతా స్టేషనుకు నాల్గుమైళ్లే దూరం."

"రైలు అందదేమో"

నాగేశ్వరరావు గడియారంచూస్తూ "చక్కగా జ్ఞాపకం చేశావు. ఇక త్వరగావెళ్లకపోతే రైలు అందదు." అంటూ గబగబ వెళ్లిపోయినాడు మాట్లాడుతున్న సుబ్బారావుతోనయినా బిక్కముఖముతో వున్న భార్యతోనయినా వెళుతున్నానని చెప్పనయినా చెప్పకుండా వెళ్లిపోయినాడు.

చంద్రుడు మబ్బులలోకి వెళుతూ వస్తూ శ్యామలతో దోబూచులాడుతున్నాడు. అప్పుడే తెల్లవారుఝామున వీచే చల్లగాలి ఆరంభమయి సమస్త జీవకోటికిన్ని నూత్న శక్తిని యిస్తూవుంది. సమస్త జంతుకోటిన్ని ఒకవిధమయిన మహదానందాన్ని అనుభవిస్తున్నది. నాయికా నాయకులు నిద్రమేల్కొని బ్రహ్మానందముతో దగ్గిరగా చేరుతున్నారు. ఆసమయంలో సుబ్బారావు "వదినా... అన్నయ్య యెప్పుడూ యింతేనా?... లేక యీవేళనే యిట్లా ప్రవర్తించినాడా" అని ప్రశ్నించినాడు.

ఈ ప్రశ్నకు ఆమెప్రాణము లేచివచ్చింది. ఇంతకాలము వరకూ 'నీవూ నీపెనిమిటీ ఎట్లా వుంటున్నార'ని ఆమెను ఎవరూ అడిగినవారులేరు. అతను యింజనీరు. పెద్దజీతము. పయిగా ధనాఢ్యుడు. భార్యాభర్తలు యీడూ జోడుగా కనబడతారు. ఎవరయినా నీవు ఎట్లా సంసారము చేస్తున్నావని ఎందుకు అడుగుతారు! ఆమె తలిదండ్రులు అతణ్ణి మూర్ఖుణ్ణిగా - మర్యాద తెలియనివాణ్ణిగా యెంచినారు.

శ్యామల ఒక్క నిట్టూర్పువిడిచి "ఎప్పుడూ యింతే... ఆయనకు యిల్లూ వాకిలీ అనేది లేదు" అన్నది.

సుబ్బారావు మందహాసముచేస్తూ "అవును. అట్లాగే తోస్తున్నది...నిన్ను చూడగానే అనుకొన్నాను. ఈ రెండు సంవత్సరాలలో యెంత చిక్కిపోయినావు!......" అన్నాడు.

ఆమె అత్యంత విచారముతో "ఏమో నాకు తెలియదు. నాకర్మము. మామయ్య యీ సంబంధము వద్దో అంటూ వున్నా మా నాన్న చేశాడు. నాన్న ఏదిచేసినా యింతే..." అంటూ వుండగా శ్యామల తల్లి అందుకొని "ఏమిటే నీముఖము. వెర్రిమాటలూ నీవూనూ. ఎవరయినా వింటే నవ్విపోతారు. చెప్పకుండాపోతే పోయినాడులే. ఇంతమాత్రానికేనా?" అని గదమాయించింది.

## ౨

రాత్రి ౯౪ గంటలకు వివాహ శుభముహూర్తము. ఇల్లంతా హడావిడిగా వుంది. సుబ్బారావు పగలంతా ఏవేవో పెళ్లిపనుల కోసము తంటాలుపడి పడి అలిసిపోయి పెళ్లికూతురూ - పెళ్లికొడుకూ మంగళాస్నానాలకు లేవగానే మేడమీదికి వచ్చి గదిలో మంచముమీద వాలినాడు.

ఏమీ నిద్రపట్టేట్టు కనుపించలేదు. అయితే మంచముమీదమాత్రము అటూ యిటూ మసులుతూ వున్నాడు. క్షణము సేపయ్యేసరికి శ్యామల జ్ఞాపకమువచ్చింది. అంత చలాకీ అయిన దానికి - అంత హుషారయిన దానికి - అంత తెలివి తేటలుగలదానికి - అటువంటి పెనిమిటి దొరకడమేమిటో ననుకొన్నాడు.

ఒకప్పుడు సుబ్బారావుకు శ్యామలనిచ్చి వివాహము చేయవలెననే అభిప్రాయము తలిదం|డులకు కలిగింది. అయితే సుబ్బారావు బీదవాడు. అంతేకాదు, వయసులో ఒకటిన్నర సంవత్సరమే పెద్ద. అందువల్ల ఆ అభిప్రాయ అభిప్రాయమాత్రము గానే ఆగిపోయింది. ఇప్పటికీ అతని వివాహానికి అతని దారిద్ర్యమే అడ్డంకిగావుంది.

సుబ్బారావు శ్యామలకు మరిది వరస. అయితే ఎక్కడో దూరపు బంధుత్వము. అందువల్లనే పరిచయముతప్పదో స్త్రీ ఆటే లేదనవచ్చు. పయిగా కృష్ణయ్యపంతులుగారి యింట్లో ఏ శుభకార్యానికయినా అశుభకార్యానికయినా చాకరీచేసి సంతోషపెట్టడానికే సుబ్బారావూ, అతని తలిదండ్రులూ వచ్చేవాళ్లు. అందువల్ల గిట్టుబాటు కాకపొయ్యేది అనడానికి ఏమాత్రమున్నూ వీలులేదు.

ఇప్పుడు సుబ్బారావుకు శ్యామలగొడవే పట్టింది. కృష్ణయ్యగారికి అల్లుడుమీద ఎంతో కోపంవచ్చింది. తనంత వాడియింటికి వచ్చి - తనతో "చెప్పనయినా చెప్పకుండా వెళ్లిపోతాడా...సరే వాడికి పెళ్లాము అవసరము లేదూ? నాయింటికి తిరిగి రాడూ; పోనీ. ఆ మూర్ఖుడికి బుద్ధిచెప్తాను" అంటున్నాడు. తల్లి "ఏదో పెద్ద అధికారి. తగిన మర్యాద యీ మొగవాళ్లు చేశారో లేదో" నంటున్నది.

యువతీ హృదయాన్ని కాస్తో కూస్తో తెలుసుకొన్నవాండ్లు "విడేమిటి - శుద్ధ మొద్దులాగా వున్నాడు...ఇంత మనోహరమయిన యువతి దొరికితే వీడేమిటి...ఏదో మట్టిముశాన్నముతో తంటాలు పడుతూ అరవై ఘడియలూ వెళ్లబుచ్చుతా నంటాడు" అంటున్నారు.

సుబ్బారావు ఆటే ఆలోచించి ఆలోచించి "అసల తనికి భార్య యెందుకూ?...ఏదో తెలియక పెద్దలు పెళ్లి చేసినారు. కాని యీ తలిదండ్రులనే వాండ్లకు బిడ్డలను కనడమూ - అందులో ఆడపిల్లలను కనడమూ - ఆ పిల్లలకు వయస్సు వచ్చినప్పటినుంచీ పెళ్లి చేయవలెనని ఆలోచించడమూ - ఏవో ఆర్థికవిషయా లాలోచించి ఎవడికో ముడివేయడమూ తప్ప యీ పెండ్లిచేస్తే భార్యాభర్తలు సుఖముగా - హాయిగా కాపరము చేస్తారా చేయరా అనే ఆలోచనయినా చేయరుగదా!" అనుకొంటూ కళ్లు మూస్తూ తెరుస్తూ ఆపందిరి మంచముమీద అటూ యిటూ పొల్లిగింతలు పెడుతూ వున్నాడు.

శ్యామల ఆదరా బాదరాగా ఆ గదిలోకి పరుగెత్తుకొని వచ్చింది. మంచంమీదవున్న సుబ్బారావును గమనించనే లేదు. గబగబా పెట్టెలుతీసి అటూ ఇటూ పడేసి తనపెట్టె మూత తీసింది. అందులోనుంచి ఒకచీరె తీసి నిలువుటద్దానికి ఎదురుగుండా నిలుచుని చీరె రంగు తనరంగుకు సరిపోతుందో సరిపోదో నని చూసుకొంటూవుంది. మంచముమీది మనిషి

వున్నట్టు అద్దములో గోచరించింది. 'నయమే యింకా చీరె విప్పలేదు' అనుకొంటూ వెనకకు తిరిగి "ఎవరా పడు కొన్నది" అన్నది.

సుబ్బారావు మాట్లాడలేదు. అతను గోడవైపు ముఖము పెట్టుకొని అటుతిరిగి పడుకొని వున్నాడు. అందువల్ల చప్పున పోల్చలేకపోయింది. అతను పలకకపోయేసరికి ఆమెకు విపరీతమయిన కోపమువచ్చి మంచందగ్గిరకువచ్చి చూసింది.



కోపమంతా అప్రయత్నముగా పోయింది.

"సుబ్బా...సుబ్బా" అని మృదుమధురస్వరముతో పిలిచింది. ఆ కంఠధ్వని అతనికి కర్ణపేయము అయింది. ఏముఖద్వారమునుంచి ఆధ్వని బయలుదేరిందో ఆముఖాన్ని - అదివరలో అనేక పర్యాయములు చూచినదయినప్పటికిన్ని - చూడవలెననే కుతూహలము పుట్టింది. కాస్సేపు ఆమెను మాట్లాడించవలెననే సంకల్పము కలిగింది. అయితే వెంటనే ఆమె పంకకు [illegible]ండానే "ఊఁ... ఊఁ" అంటూ అప్పుడే - ఆ పిలుపుకు నిద్ర మెళకువవచ్చినవాడిలాగా మూలిగాడు.

"నిద్రపట్టిందా"

"పడుతూ పడుతూవుంది"

"ముహూర్తము సమీపిస్తుంటే నీవువచ్చి యిక్కడ నిద్రపోతున్నావూ"

"అయితే నీవెందుకువచ్చావు యిక్కడికి?"

"నిన్ను నిద్రలేపుదామని"

"నిద్రలేవ బుద్ధిపుట్టడంలేదు"

"బుద్ధిపుడుతుందిలే... లే..." అంటూ చేయిపట్టుకొని లేవదీసింది. సుబ్బు లేచి కళ్లునులుపుకొంటూ కూర్చు న్నాడు. ఎదట మందహాసముతో - వాలుగన్నులతో - అతనిముఖము చూస్తూవున్న శ్యామల కనపించింది...కింద నుంచి సన్నాయిధ్వని శ్రావ్యముగా విన పడుతున్నది. కిటి కీలోనుంచి వస్తూవున్న మందమలయానిలము చంద్రో దయాన్ని జ్ఞాపకము చేస్తూవుంది. ఎదటవున్న ఆ తెల్లటి శ్యామలాదేవి ముఖముమీది నల్లటి భ్రుకుటి... మోహాకరాళ కాళసర్పీ తదుదిత విషభంజనాయ...త్వదధరసీధుసుధైవ ...అని ఎప్పుడో చదివిన పద్యము జ్ఞాపకము చేస్తూవుంది.

బుర్ర పనిచేయడము మానివేసింది. దేహము మాత్రము ఉప్పొంగిపోతూవుంది. ఏమీ మాట నోటివెంట వచ్చేట్టు లేదు.

"లే. సుబ్బా లే..." అన్నది శ్యామల.

"లేచాను. నిద్రపోయింది"

"అయితే ముందు నీవు వెళ్లు"

"నీవో"

"నేనూ వస్తాను"

"రా"

"చెల్లెలికి మంగళస్నానము చేయిస్తూవుంటే నాచీరె మీద నూనె - నీళ్లూ పడ్డవి. ఈ చీరెవిప్పి యింకొకటి కట్టు కొని వస్తాను. నీవు పద."

సుబ్బు చటుక్కున [illegible] వాలి "నేను అటు తిరిగి పడుకొని కళ్లుమూసుకొంటాను. నేను చూడనులే. నీవు కట్టుకో వుభయులమూ కలిసే క్రిందికి వెళుదాము."

"అబ్బ ఏమిటి వేళాకోళము. పోనీ నీవు బయట నిలుచో..."

"ఫరవాలేదు. కండ్లు మూసుకొంటున్నానులే..."

"ఆలస్యము చేయకు...లే...ఎవరయినా వస్తే ఏమన్నా అనుకొంటారు. లేద్దూ. బాగుండదు.

"బాగుంటుంది శ్యామా"

"ఇదుగో నాకు కోపము వస్తున్నది. ఏమిటా మాటలు...ముందు బయటకు వెళుతావా - వెళ్లవా" అని బిగ్గరగా అన్నది శ్యామల.

సుబ్బు ఎట్లాగూ వుండ్రవాడు. భయపడ్డాడు. కిక్కురు మనకుండా లేచి వాకిలి యివతలకు వచ్చినాడు. చంద్రుడు తొంగిచూసి నవ్వుతున్నాడు. సుబ్బుకు కోపమూ - ఏడుపూ రెండూ వచ్చినవి.

హఠాత్తుగా చంద్రుడు డంతర్ధానమయి పోయినాడు. అంత చైత్రమాసములోనూ అకాలముగా యిట్టే మబ్బు పట్టింది. గాలి చెలరేగింది. ఒక్క వురుము వురిమింది. గాలికి తలుపు రపీమని తెరుచుకొంది. ఒక్క మెరుపు మెరిసింది. ఆ మెరుపు వెలుతురుకు శ్యామలా లతాంగిసైజలావణ్యము సుబ్బుకు దృష్టి గోచరమయి కుంచించుకొని పోబోయింది......సుబ్బు వాయువేగముతో........కాదు కాదు...వాయువేగము సుబ్బును గదిలోకి నెట్టింది.

వర్షము జోరుఅయింది. దక్షిణపుగాలి యింకా జోరుగా సాగింది. ఉత్తరపు వైపుకు వున్న తలుపును దక్షిణా నిలుదు మూసివేసినాడు. ఆ తలుపు తెరవడానికి ఒక్క వాయుదేవుడికే సాధ్యమవుతుందేమో!

## 3

పెళ్లి అయిపోయింది. పదహారు రోజుల పండగ అయిపోయింది. పెళ్లికివచ్చిన చుట్టాలూ పక్కాలూ అంతా ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయినారు. కొత్తల్లుడు కూడా చక్కని పంచెలు చుట్టబెట్టుకొని వెళ్లిపోయినాడు.

సుబ్బూ శ్యామలా మాత్రము వాళ్ల యిండ్లకు వెళ్లిపోకుండా వున్నారు. శ్యామల దేహములో రోజురోజుకు మార్పు వస్తూవుంది. అన్నము అరగడము లేదు. అరుచికపోవడం కాదు, ఇమడడము లేదు. రోజుకు ఒకటి రెండు పర్యాయములయినా వాంతులవుతూ వున్నవి. ఒళ్లంతా విరవిరలాడి పోతూవుంది. కారణమేమిటో తిన్నగా బోధపడింది కాదు. అంతవరకూ తలనొప్పి అయినా ఎరగని ఆరోగ్యవంతురాలు ఆమె. ఆమెకు చాలా ఆశ్చర్యముగానే వుంది. ఏమిటో వూహలు చేయడము మొదలు పెట్టింది...ఏదో భయము ఆరంభమయింది.

సుబ్బు మనస్సంతా డోలాయమానంగా వుంది. శ్యామలను వదిలిపెట్టి వెళ్లడము అనే భావము రాగానే ఒకలక్ష వృశ్చికాలు కుట్టినంతబాధ కలుగుతుంది. ఆమెతో శాశ్వతముగా వుండడమెట్లా? పట్టుగా, జరుగుతున్న వ్యవహారము పెద్దవాళ్లకు తెలిస్తే...ఏమన్నదో చేస్తారనే భయము కొంత మాత్రమున్నూ లేదు. కాని శ్యామల గతేమిటి అనే ఆలోచనే అతన్ని బాధపెట్టడము మొదలు పెట్టింది. కర్తవ్యము నిశ్చయించలేక పోయినాడు. 'భర్త వదిలివేస్తాడేమో...వదిలివేస్తే తండ్రి...అమ్మో ఏంచేస్తాడో...' నిద్రపట్టదు. అహోరాత్రములూ యిదే ఆలోచన. తన కెందుకా బుద్ధిపుట్టవలెనని తన్ను తాను తిట్టుకోడం మొదలు పెట్టినాడు. మళ్లీ కొంచెం సేపటికి 'నిజమే నాకు బుద్ధిపుడితే పుట్టింది. శ్యామల ఎందుకు అంగీకరించవలెను?......' అనే ఆలోచన తట్టింది.

రాత్రి పన్నెండు గంటలయింది. యావద్విశ్వమూ గాఢసుషుప్తిలో వుంది. యథాప్రకారము శ్యామల తలుపు చప్పుడు చేసింది. ఒక్కక్షణము వుండలేక పోయినాడు. లేచి అటూ ఇటూ చూసి మెల్లిగా అడుగులో అడుగులు వేస్తూ యింటివెనక వున్న తోటలోకి వెళ్లినాడు. ఆ గాఢాంధకారములో చంద్రబింబము లాగా శ్యామల మెరుస్తూ కనిపించింది. హుటాహుటీ నడిచి ఆమెను సమీపించి ఆలింగనము చేసుకొన్నాడు...ఉక్కుతునకలాగావున్న అతని దేహాన్ని శ్యామల నిమురుతూ సుబ్బూ...సుబ్బూ...నెలతప్పింది...ఇక నేనిక్కడ వుండను?" అన్నది.

"అయితే వెళ్లిపోతావా ?"

"వెళ్లకపోతే యెట్లా...ఎవరికయినా తెలిస్తే ?..." మాట యింకా పూర్తికాలేదు, సుబ్బి ఆమెను తోసివేసి "నీవు యింత దగామారిదానివనుకోలేదు. అయితే ఇది అతనికే అంటగట్టదలచుకొన్నావన్న మాట" అన్నాడు.

"మరేంచేయడం సుబ్బా... అమ్మా నాన్నకు తెలిస్తే చంపివేస్తారు... మన్నిస్తే... నన్ను ఆయన దగ్గిర దిగబెడతారు. అంతకన్న మరొక మార్గం లేదు...

"అయితే ఆయనకే తెలిస్తే ?"

"ఆయనకు తెలిస్తే ఫరవాలేదు. ఆయన మన్నిస్తారు"

"ఏమిటా నమ్మకము"

"ఆయన సంగతి నాకు తెలుసు. అంత గొప్పహృదయమున్నవాడు యీ ప్రపంచములో లేడు."

"మరి నీకూ ఆయనకూ కుదరలేదేం ?"

"అది నాకర్మము. ఆయనకీ ప్రాపంచిక విషయాల మీదికి బుర్ర పోదు. ఆయన లోకాన్ని ఉద్ధరించడము కోసం పుట్టాడు.

"శ్యామా అటువంటివాణ్ణి మోసము చేస్తావా ?"

—"మోసం చేయవలెననుకొన్నా చేయలేను. ఆయన్నే సలహా అడుగుతాను."

"ఏమిటీ...?"

"ఆయనతో చెపుతాను"

"నిన్ను తక్షణం వెళ్లి పొమ్మంటాడు"

"ఆయన అట్లా అనడు. ఆలోచించి నాకు తిన్ననిమార్గం చూపిస్తాడాయన"



" ఈ అల్లరిఅంతా ఎందుకు... నేను నిన్ను వదిలిపెట్టి వుండలేను.

" నాకు తెలుసు. నేనూ నిన్ను వదిలిపెట్టి వుండలేను... ప్రపంచమంతా నన్ను చూసి వుమ్మివేసినా నిన్ను వదిలిపెట్టి వుండలేను. అయితే... నీ తల్లిదండ్రులు...

" వాళ్లగోలతో నిమిత్తంలేదు... మనము ఎక్కడికయినా వెళ్లిపోయి వుందాము"



" ఆయనతో చెప్పకుండా-ఆయన అంగీకారము లేకుండా - ఆయనసలహా లేకుండా - అట్లాచేయను. పయిగా దారిద్ర్యము తలచుకొంటే భయము వేస్తూవుంది. అమ్మయ్యో..."

" అయితే నీవు నాకవసరం లేదు."

" సుబ్బూ అంత తొందరగా కొట్టివేయకు......నీకు తెలియదు. మనము ముందుముందు యెన్ని యిబ్బందుల పాలవుతామో ?...

" నాకదంతా తెలియదు. ఇబ్బందులువస్తే అనుభవింతాము. అసలు మనది భగవంతుడు కూర్చిన సంబంధం. మనకు యిబ్బందులంటూ రావు."

" సుబ్బూ ... ఎవరో వస్తూవున్న మనిషి ?"

" అయ్యో - అప్పుడే తెల్లవారవస్తూవుంది. ఆ వస్తూవుంది మీ నాన్న "

" అమ్మో.......సుబ్బూ నేనా మామిడిచెట్లు చాటుకు వెళ్లిపోతాను. ఇక్కడే వస్తున్నాడల్లె వుంది " అంటూ వెళ్లిపోయింది.

## ౮

పెరియారనే నది కొండలలోనూ - ఊసర క్షేత్రములలోనూ తిరిగి తిరిగి ద్రావిడదేశము మీద ఆగ్రహము కలిగో ఏమో మళయాళాంగుల సహాచర్యము చేయడానికో ఏమో పోయి సముద్రములో చేరింది. ఆనది ద్రావిడదేశములో ప్రవహించినంతటా జనులు అన్నార్తులయిపోయినారు.

పంచభూతాలనూ గజగజలాడించే బ్రిటీషు యింజనీర్లు దక్షిణదేశపు నదీ గతులను శాసిస్తూవుంటే నాగేశ్వరరావు పెరియారు మార్గాన్ని తిప్పివేయడానికి పూనుకొన్నాడు.

మూసార్ధము నుంచి పెరియారు వెంటబడి దానిగతిని కని పెట్టినాడు. ఎక్కడ ఏవిధముగా దాన్ని నిర్బంధించి గతిని మళ్లించవలెనో నిశ్చయము కాలేదు. ఆ కొండలలో ఏ ప్రదేశములో పెరియారును నిర్బంధించ వీలయ్యేది నిర్ణయించడానికి తిరుగుతున్నాడు. అటు పడమటికి వెళ్లి సముద్రములో కలియడానికి వీలులేద న్నాడు తూర్పున బంగాళాఖాతము లోనే సంగ మించడానికి పెరియారును ఒక కొండలోయలో నిర్బం ధించి నైజగతిని నిరోధించ నిశ్చయించినాడు. వారము రోజులనుంచి అతను భోజనముచేసినాడో లేదో అతనికే తెలి యదు. అనువరులా విషయాన్ని జ్ఞాపకము చేయడాని కయినా వీలు లేదు. రుద్రావతారము. ఆనాడు గంగను తన జటా జూటములో బంధించి ఏమాత్రము గంగను కిందికి వదలవలెనో ఆమాత్రమే వదలడానికి నిలుచున్న కైలాస మూర్తిలాగా వున్నాడు నాగేశ్వరరావు. ఎవడే మాత్రము కదిలించివా వాణ్ణి భస్మము చేసివేస్తాడు.

సాయంకాల మయింది. నాగేశ్వరరావు తనగుడారపు వసలో వున్నాడు ఆ మహారణ్య ప్రదేశములో దేవతలు చేసే భోజనము చేయడానికి సిద్ధపడుతున్నాడు. ఒక నౌఖరువచ్చి వినవిధేయ తలతో సలాముగేసి నిలుచు న్నాడు, 'ఏం' అన్నట్టు వాడివంక చూసినాడు. "అయ్యా అమ్మగారు వచ్చినారు" అన్నాడు నౌఖరు. నాగేశ్వరరావు నిర్ఘాంతపోయినాడు. క్షణలేశములో అత్యుత్సాహము వచ్చింది. లేచి శ్యామల నాహ్వానము చేయడానికి బయలుదేర బోతూండగానే శ్యామల ప్రత్యక్ష మయింది.

"శ్యామా...చాలా మంచిసమయాన వచ్చావు... రెండులక్షలమంది జనానికి - అన్నాతురు లయినవారికి అన్నము కల్పించడానికి ఇదుగో యీ యెదట కనబడు తున్న నదిని నిర్బంధించ బోతున్నాను..." అన్నాడు.

ఆమె తలవంచుకొనే వుంది. ఏమీ జవాబు చెప్పలేక పోయింది, కట్టెలాగా నిలుచున్నది...అతనామె స్థితిని గమనించనే లేదు. అతని ధోరణిలో అతనున్నాడు. మళ్లీ "శ్యామా...నీతో ఖులాసాగా కాలక్షేపం చేయలేదని నిష్ఠురము లాడినావుకాదూ...ఇక నీకు కావలసినంత - నీవు వద్దనేటంత ఖులాసా యిస్తాను...ఏమి మాట్లాడవేం' అంటూ ఆమె ముఖమెత్తి ముద్దుపెట్టుకొన బోయినాడు. ఇంతలో సుబ్బారావు ప్రవేశించినాడు. చుంబన ప్రయ త్నము విఫలమయిపోయింది. శ్యామల కళ్లవెంట బిందు వులు ముత్యాలులాగా రాలినవి. అది నాగేశ్వరరావు చూసినాడు. సాలోచనముగా నఖశిఖ పర్యంతమూ శ్యామ లను నాగేశ్వరరావు చూసినాడు. అది వట్టిచూపు కాదు. శ్యామలదేహములోకి ఆచూపు చొరుచుకొని పోయి చూస్తూవుంది. ఆ చూపుకు శ్యామల కంపించిపోతూ వుంది. అదిచూసి తల యిటుతిప్పి "ఏం సుబ్బారావ్...ఖులా సాగా వున్నావా ..వదినెను వెంటబెట్టుకొని వచ్చినావా చాలా సంతోషము...!" అన్నాడు.

సుబ్బారావు జవాబు వినిపించుకోకుండానే "శ్యామా. చాలా మారిపోయినావు...లే...భోజనం చేతాము. నేను ఎప్పుడు భోజనంచేసినానో మరిచి పోయినాను. ఆకలి అవుతున్నది. లే. చప్పునకానీ నీ స్నానము...సుబ్బ రావూ...లేలే ... నాకాకలి అవుతున్నది. త్వరగా కానియ్యి..." అన్నాడు నాగేశ్వరరావు.

భోజనానికి తయారయినారు. శ్యామలవారి పంక్తిలో చేరలేదు.

మౌనముతో వారుభయులూ భోజనము చేసినారు.

నాగేశ్వరరావు తన (పడకగది - అనడానికి వీలవు తుందో కాదో? అతను పడుకొనే మంచమున్నది కాబట్టి) పడకగదిలో పడకకుర్చీలో వాలినాడు. ఆ ప్రదేశములో కొండల మ్యాపులు చేతులో పుచ్చుకొని పరీక్ష చేస్తున్నాడు. అత్మనిలో అతను సంతోష పడుతు న్నాడు. బయట అంతా అంధకార బంధురముగా వుంది. కొండలమీది నుంచి గాలి రంయ్‌మని ఆ గదిలోకి కొడుతూవుంది. సామాన్య మానవులు ఆగాలికి యెగిరి పోతారు. దేహములోకానీ - మనస్సులోకానీ యెంతో తూకము వుంటేనే కాని అక్కడ నిలవడానికి వీలులేదు.

పడుకొని మ్యాపులు చూస్తూవున్న నాగేశ్వరరావు ఏదో మ్యాపులో గుర్తుపెట్ట వలెనని కలముకోసము లేచి

నాడు. ఎదుట శ్యామల తలవంచుకొని నిలుచుని వుంది. ఆమెను చూసి మందహాసముచేస్తూ తానులేచిన పని మరచి పోయి దగ్గరకు సమీపించబోతే ఆమె వెనకకు వెనకకు పోసాగింది. అతను త్వరితముగా వెళ్లితే ఆమె అతని ప్రయత్నము సాగకుండా తప్పించుకొని అతి దీనముగా ఒకమూల నిలుచున్నది. అతను కొంత ఆశ్చర్యముతో ఆమెను సాలోచనముగా చూసినాడు.

ఆమె తలవంచుకొనే "తమ ఆలింగనానికి నాకర్హత లేదు" అని కండ్లవెంట నీళ్లు కార్చడము మొదలు పెట్టినది.

"అర్హతపోయిందా...అవును ఏదో మార్పువచ్చినట్లే తోస్తున్నది..." అని చూస్తూ వూరుకొన్నాడు. ఆమే ఏమీ మాట్లాడకుండా అట్లాగే నిలుచున్నది.

"అయితే...అక్కడే వుండక పోయినావా?"

"క్షమించమని ప్రార్థించడానికీ...మార్గము చూపించమని ప్రార్థించడానికీ..."

ఆమె వ్యాకము పూర్తిచేయనే లేదు. బయటనుంచి "సార్" అని కేకవినిపించింది. "యస్" అంటూ నాగేశ్వరరావు వెళ్లి తలుపుతీసినాడు. టెలిఫోను గుమాస్తా "ఛీఫ్ యింజనీయరు తమరిని మెచ్చుకొంటున్నామనీ తెల్లవారు ఝామున వచ్చి తమరిని బంగళాలో కలుసుకొని తాము నిర్ణయించిన ప్రదేశము చూసి ఉదయము ఏడున్నర గంటలకే తిరిగి వెళ్లిపోతామనీ" ఫోనులో చెప్పినారు.

"సరి" అన్నాడు లోపలికివచ్చి "శ్యామా...తరువాత మాట్లాడుతాను...నేను యిప్పుడు పనిమీద వెళ్లి పోతున్నాను" అని చెప్పి బయటికి వెళ్లిపోయినాడు.

౫

తెల్లవారుతూ వుంది. నాగేశ్వరరావు యథాప్రకారము షికారుకే వెళ్లి వచ్చినాడు. శ్యామల యింకా నిద్రలేవ లేదు. సుబ్బరావు అప్పుడే నిద్రలేచి 'దేవీస్తోత్రము'లో నుంచి పద్యాల్లు సన్ననిగా గొంతుతో శ్రావ్యముగా పాడుతున్నాడు. నాగేశ్వరరావు వచ్చి అతని పక్కనే కుర్చీలో కూర్చున్నాడు. అతన్ని చూడగానే పాడడము ఆపివేసినాడు సుబ్బారావు.

"ఇక కర్తవ్యవమేమిటి?" అని ప్రశ్నించినాడు నాగేశ్వరరావు.

సుబ్బారావు నివ్వెరపోయి బెదిరిన గొడ్డులాగా చూడడము మొదలుపెట్టినాడు. మళ్లీ నాగేశ్వరరావు "మీరిద్దరూ పెళ్లిచేసుకోనండి. అట్లా చేయడం చాలా మంచిదని నా అభిప్రాయము."

సుబ్బారావు గాభరాకు అంతూ పంతూ లేకుండా పోయింది. నాగేశ్వరరావు అతన్ని తేరి పారచూస్తూ 'భయమక్కరలేదు. నేను అంగీకరిస్తున్నాను. అసలు నాకు భార్యతో అవసరము యిప్పటికి కనిపించలేదు...చిన్నప్పుడు నాకు వూహా తెలియనిరోజులలో పెద్దలు నాకు వివాహము చేశారు...నాకప్పుడే మాత్రము జ్ఞానమున్నా పెళ్లి చేసుకొని వుండేవాణ్ణి కాదు...ఇప్పుడు శ్యామల తన దారి తానే చూసుకొంది. చాలా సంతోషము. మీరిద్దరూ పెళ్లిచేసుకొని ఖులాసాగా వుండడమే నాకు కావలసినది."

"పెళ్లి చేసుకోడానికి హిందూ 'లా' అంగీకరించదు"

"వెధవ 'లా'. 'లా'. ఒప్పుకొంటే ఒప్పుకోకపోతే ఎంత. దైవసాక్షిగా మీరిద్దరూ వివాహము చేసుకొన్నారు. చాలు అంతే"

సుబ్బారావు ఏమీ మాట్లాడలేదు. ఇంతలో శ్యామల అక్కడికి వచ్చింది. ఆమెను నాగేశ్వరరావు చూసి

"శ్యామా...సుబ్బారావుతో చెప్పాను ... మీరుభయులూ భార్య భర్తలు, మీరు హాయిగా కాలక్షేపము చేస్తూ వుండడమే నాకు కావలసింది."

"నిజమే. కాని...

"సుబ్బా...అయితే యిక సంసారము వెళ్లదీయడానికి నీవేదో ఒక వృత్తిలో ప్రవేశించడము మంచిది. ఏమంటావు"

"ఆవును. చప్పున ఏమి దొరుకుతుంది?" అన్నది శ్యామల.

"నిజమే. అదీ ఆలోచించాను. నీవు అడగక పోయినా నా అభిప్రాయము చెప్పేవాణ్ణే...సుబ్బారావు ఏమయినా సంపాదించినా సంపాదించక పోయినా...నేను సంపాదించేటంత కాలమూ మాసానికి ఒక నూరు రూపాయలు నీకిస్తాను..."

శ్యామల ముఖము వికసించింది. ఏదో ఆలోచిస్తూ సుబ్బారావు వూరుకొన్నాడు.

"సరే...కాని మీరు భయులూ తెలుగుదేశములో స్వజనము వున్నచోట మాత్రము వుండవద్దని నా సలహా. అయినా మీయిష్టము"

"తాము...ఏ...వూళ్లో...!"



"మీరు మద్రాసులో వుండడము మంచిది. అది మహా పట్టణము...అక్కడ మీరెవరో ఏమిటో ఎవరికీ తెలియదు. మీరు కొంతకాలము ప్రచ్ఛన్నముగా వుండడమే మంచిదను కొంటాను. అంతేకాదు. జీవనాధారానికి కూడా చప్పున ఏదయినా వృత్తిచూసుకో వచ్చును."

సుబ్బారావు అంగీకారాన్ని ముఖములో కనబర్చినాడు.

శ్యామల ఏదో ప్రశ్నించవలెనను కొంటున్నది. అయితే నాగేశ్వరరావు అది గమనించలేదు.

తెల్లవారిపోయింది. నాగేశ్వరరావు అసిస్టెంట్లు అప్పుడే హాజరయి సలాములు చేసినారు. వాళ్లనుచూస్తూ "అయ్యో మరిచిపోయినాను...నేను కాల్యాలు తీర్చుకొని వస్తున్నాను. మీరు వెళ్లండి" అని దగ్గరవున్న మనుష్యుల సంగతే ఎరగనట్టు లోపలికి వెళ్లిపోయినాడు.

శ్యామల అత్యంతానందముతో సుబ్బారావువంక చూసింది. అతను అక్కడలేడు. అదేదో లోకములో వున్నట్టుగా వున్నాడు. ఆమె అతనియెదట ఉన్నదన్న మాటేగానే ఆమెను అతను చూడడమే లేదు. స్థూలచక్షువులా మెను చూస్తూ వుంటే వుండవచ్చును. శ్యామల అతని చేయి పట్టుకొని "ఏమిటాలోచన?" అన్నది.

అతని కళ్లలో నీళ్లు తిరుగుతున్నవి. ఆమెవంక వెర్రి వాడిలాగా చూస్తూ "ఈయన దేవలోకములో వుండ వలసినవాడు...పొరపాటున మనుష్య లోకములోకి వచ్చి నాడు" అన్నాడు.

"అవును నేను చెప్పలేదూ"

"అబ్బ...ఈ మహానుభావుణ్ణి ఎట్లా వదిలిపెట్ట దలచావో..."

"అవును నేను మామూలు స్త్రీని. ఆయన దివ్యుడు. అందువల్ల..."

"ఏమో"

"శుభసమయములో ఏమిటీ విచారము" అంటూ శ్యామల అతనిని మందలించింది.

సూర్యు డుదయించాడు. కోడి కొక్కురకో అని కూసింది.

♦ ♦ ♦

భారతజాతీయ పండగలలో మకరసంక్రాంతి కూడా ఒకటని చెప్పవచ్చును.

ఆనాడు సూర్యుడు మకరము ప్రవేశించబోతున్న సమయములో శ్యామల స్త్రీ శిశువును ప్రసవించినది.

ఆ దంపతులకీ ప్రపంచములో వున్న ఒక్క ఆప్తుడూ నాగేశ్వరరావూ. అతనికీ శుభవర్తమానము సుబ్బారావు తంతిమూలకముగా తెలియజేసినాడు.

---


దేహానికి ఆహారము ఎంత అవసరమో వెంట్రుకలకున్నూ అంత అవసరమే

జగత్ప్రసిద్ధమయిన "కామినియా తైలము (రిజిష్టర్డు)

వుపయోగించండి



రోమరాజము చక్కగ వృద్ధి అయ్యే మూలికలతో అది తయారు చేయబడినది. చలవ చేస్తుంది. ఇంపు అయిన వాసన వేస్తుంది.

ఒక సీసా 1 రూపాయి. 3 సీసాలు రూ. 2—10—0

వి. పి. చార్జి ప్రత్యేకం. అర్ధణా పోష్టుబిళ్లకు శాంపిలు పంపుతారు

ఒట్టో దిల్ బహార్



ఆకర్షణీయ మయిన సుగంధము కలది. అనేక అపరూప పుష్పములతో తయారు అయినది. శాంపిలు 2 అణాల బిళ్లకు పంపుతారు. వి. పి. చార్జి ప్రత్యేకం.

వెల పావు ఔన్సు సీసా రూ. 1-4-0. ఒక డ్రామ్ 12 అణాలు

సోలు ఏజంట్లు

ది ఆంగ్లో యిండియన్ డ్రగ్ & కెమికల్ కంపెని

బొంబాయి 2